AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
9-4-2026 (Thursday) MAIN EDITION

## గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. కానీ దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. హర్దీప్ సింగ్ పురీ ఈరోజు, రేపు ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 1112 తేదీల్లో జై శంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ పేర్కొంది.

## ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆదాయపన్ను శాఖలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సీనియర్ ఐఆర్‌ఎస్ అధికారి సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న మోరంపూడి అనిల్ కుమార్ స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు స్వీకరించనున్నారు. అనిల్ కుమార్ కూడా తెలుగు అధికారి కావడం, ఆయన స్థానంలో మరోసారి మరొక తెలుగు అధికారికి ఈ అత్యున్నత పదవి దక్కడం విశేషం.

## ‘పాక్‌పై మాకు నమ్మకం లేదు’



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయిల్ సందేహం వ్యక్తంచేసింది. ఇస్లామాబాద్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్‌లోని ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## మూడు రాష్ట్రాల్లో పోలింగ్



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: కేరళం, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. కేరళంలోని 140 అసెంబ్లీ స్థానాలకు 30,471 పోలింగ్ కేంద్రాలు, అస్సాంలోని 126 అసెంబ్లీ స్థానాలకు 31,486 పోలింగ్ కేంద్రాలు, పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు 1,009 పోలింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశారు.

## జలపాతంలో పడి బాలికలు మృతి



అక్షరటుడే, ఏపీ: అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆస్పత్రికి తరలించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా రోలెక్స్ వాచీలు పట్టివేత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని శంషాబాద్ విమానాశ్రయంలో రోలెక్స్ వాచీలు కలకలం రేపాయి. ముంబైకి వెళ్తున్న ఇద్దరు ప్రయాణికుల వద్ద నుంచి సుమారు రూ. 18 కోట్ల విలువైన 30 విలాసవంతమైన రోలెక్స్ వాచీలను ఆర్‌జీఐఏ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాచ్‌లను హైదరాబాద్ నుంచి ముంబైకి తరలిస్తుండగా స్కానింగ్ సమయంలో అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా ఉన్న ప్యాకేజీలను తనిఖీ చేయగా ఖరీదైన వాచీలు బయటపడ్డాయి. దీంతో అధికారులు ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు.

## హిందూ దేవుళ్లను కించ పరుస్తూ మహిళ పోస్టులు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** హిందూ దేవుళ్లను కించపరుస్తూ ఓ మహిళ సోషల్ మీడియాలో పోస్టులు చేసింది. ఆమెపై హిందూ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. బంజారాహిల్స్‌లోని సబ్యసాచి స్టోర్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుమిత హిందూ దేవతలను అవమానించేలా పోస్టులు చేసింది. శ్రీరాముడు, గణేశుడు, ఆంజనేయుడిపై అసభ్యకర పోస్టులు పెట్టింది. ఆమెపై హిందవులు, హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులకు హిందూ సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీశారంటూ పేర్కొన్నారు.

**మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలనలో ముఖ్యమంత్రి విఫలం అయ్యారని విమర్శించారు. రెండున్నరేళ్లలో రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరుతానని తెలిపారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్**



# పాలనలో రేవంత్‌రెడ్డి విఫలం

**▪ కాంగ్రెస్ కంటే కేసీఆర్ పాలన వంద రెట్లు నయం ▪ బీఆర్‌ఎస్‌లో చేరుతా ▪ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**

జీవన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఈ క్రమంలో గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. కేటీఆర్ మొదట హైదరాబాద్ నుంచి ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేసీఆర్‌తో చర్చించారు. జీవన్ రెడ్డి చేరిక, పార్టీ ఆవిర్భావ సభ, ఇతర అంశాలపై మాట్లాడారు. అనంతరం జగిత్యాలకు బయలు దేరారు.

### వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం

కేటీఆర్‌తో భేటీకి ముందు జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన 100 రెట్లు బెటర్ అని పేర్కొన్నారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఏ రోజు చేరుతాననే విషయాన్ని కేటీఆర్‌తో భేటీ అనంతరం చెబుతానన్నారు. రెండున్నరేళ్ల పాలనలో రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో విఫలం అయ్యారని విమర్శించారు.

### మార్పు కోరుకుంటున్నారు

పదేళ్ల కేసీఆర్ పాలన కంటే మెరుగైన పాలన వస్తుందని తాము ఆశించామన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో తిరోగమనంలో పయనిస్తుందన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రత్యామ్నాయం కావడంతో ఆ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు బంధు పథకాన్ని నీరుగార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. మేడిగడ్డను బాగు చేయలేదని, తుమ్మిడిహట్టి వద్ద పనులు రెండున్నరేళ్లు అవుతున్నా.. అడుగు కూడా కదలలేదన్నారు. రేవంత్‌రెడ్డి మిగిలిన పాలన కాలంలో అయినా.. మంచి పరిపాలన చేయాలని హితవు పలికారు.

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది: మోదీ



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్‌పై విరుచుకు పడ్డారు. టీఎంసీ ప్రజల మనసుల్లో భయాన్ని నాటిందన్నారు. చొరబాటుదారులు బెంగాల్ యువత ఉద్యోగాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే పారదర్శక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. వారసత్వ రాజకీయాలు ఉండవని మాట ఇచ్చారు. ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి సాధించిన విజయాన్ని మోదీ ప్రస్తావించారు. గత ఎన్నికల్లో జరిగిన ఆ అద్భుతం ఈసారి భబానీపూర్‌లోనూ, రాష్ట్రవ్యాప్తంగానూ పునరావృతమవుతుందని పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం మేదినీపూర్, నందిగ్రామ్ మార్పునకు మార్గాన్ని చూపించాయన్నారు.

## హీట్‌వేవ్ అలెర్ట్.. మండనున్న ఎండలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు మండనున్నాయి. ఈ నెల 12 నుంచి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావారణ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. అకాల వర్షాలు కురిసిన సమయంలో కాస్త చల్లబడ్డ భానుడు.. మిగతా సమయాల్లో తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఏప్రిల్ 12 నుంచి 22 వరకు ఎండలు మరింత ఎక్కువగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 12 నుంచి 22 వరకు హీట్‌వేవ్ ప్రభావం ఉండనుంది. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వనపర్తి, గద్వాల్, ఉమ్మడి ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే ఛాన్స్ ఉంది. హైదరాబాద్‌లో 40-41 డిగ్రీల మధ్య ఎండలు ఉండనున్నాయి. అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.


## ఆ గాసిప్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టిన మృణాల్ ఠాకూర్..!



**సుమంత్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ పెళ్లి చేసుకోబోతున్నట్లు ఇటీవల గాసిప్స్ వచ్చాయి. ‘సీతారామం’ సినిమాలో మృణాల్‌తో కలిసి సుమంత్ నటించిన విషయం తెలిసిందే. ఆ సినిమా టైంలోనే వీళ్లు ప్రేమలో ఉన్నట్లు, పెళ్లి చేసుకోబోతున్నట్టు ప్రచారం జరిగింది. అందుకు సుమంత్ కూడా ‘అనగనగా’ సినిమా టైంలో క్లారిటీ ఇచ్చారు. అవి గాసిప్స్ అని కొట్టిపారేశాడు. అయితే ఇటీవల జరిగిన ‘డెకాయిట్’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సుమంత్‌తో కలిసి కనిపించింది మృణాల్ ఠాకూర్. దీంతో మళ్లీ రూమర్లు పుట్టుకొస్తాయని భయపడినట్టుంది ఈ బ్యూటీ. ఈవెంట్‌లో మాట్లాడుతూ ఓ సందర్భంలో ‘సుమంత్ అన్నా’ అంటూ పిలిచి గాసిప్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేసింది.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**

## హర్ముజ్‌ను మళ్లీ మూసివేసిన ఇరాన్.. వార్నింగ్ ఇచ్చిన ట్రంప్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. హర్ముజ్ జలసంధిని తెరవకపోతే దాడులు తప్పవని హెచ్చరించారు. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. హర్ముజ్ జలసంధిని తెరవాలనే షరతుతో అమెరికా సీజ్‌ఫైర్‌కు ఓకే చెప్పింది. ఇరాన్ సైతం దీనికి అంగీకరించింది. అయితే ఇరాన్ పది షరతులు పెట్టింది. అందులో లెబనాన్‌పై దాడులు చేయొద్దని పేర్కొంది. అయితే ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. దీంతో హర్మ్యూజ్ జలసంధిని మళ్లీ మూసి వేస్తూ ఇరాన్ నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్ తీరుపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అనుమతి లేని నౌకలు హర్ముజ్ దాటడానికి ప్రయత్నిస్తే ధ్వంసం చేస్తామని వార్నింగ్ ఇచ్చింది.

## హైదరాబాద్ భారీ అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్‌లో మరో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జీడిమెట్లలోని ఓ పరిశ్రమ గోదాంలో గురువారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. జీడిమెట్లలోని పారిశ్రామిక వాడలో ఉన్న నిలువ ఉంచిన వేస్ట్ కెమికల్ గోదాంలో మంటలు అంటుకున్నాయి. గోదాంలో రసాయనాలు ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి, పొగ అలుముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ల టోకరా..



**అక్షరటుడే, హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యుల నుంచి పెద్దపెద్ద నేతలు, వ్యాపారవేత్తల వరకు ఎవరిని వదలడం లేదు. మాటలతో మాయ చేసి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. తాజాగా ఓ ఎమ్మెల్యేను సైబర్ నేరగాళ్లు మోసం చేయడం గమనార్హం. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ దొంగల చేతిలో మోసపోయారు. సైబర్ నేరగాళ్లు ఎమ్మెల్యేకు ఫోన్ చేశారు. “వికసిత్ భారత్” పథకం కింద అర్హులకు రూ.10 లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మించారు. అర్హుల జాబితా పంపించాలని సూచించారు. దీంతో నిజమేనని నమ్మిన ఎమ్మెల్యే జాబితా పంపారు. రుణం కోసం ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున రూ. లక్ష ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని సైబర్ నేరగాళ్లు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే వారు చెప్పిన ఖాతాకు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించారు. మరోసారి నిందితులు డబ్బులు అడగడంతో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి అనుమానం వచ్చింది. విచారించగా.. ఇది సైబర్ నేరగాళ్ల మోసం అని తేలింది. దీంతో ఆయన వెంటనే వెంటనే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.